03-08-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

" మధురమైన పిల్లలారా - మీలో సర్వీసు చేయాలనే ఉత్సాహము పొంగి పొర్లుతూ ఉండాలి. మీలో జ్ఞాన - యోగాలుంటే, ఇతరులకు కూడా నేర్పండి. సర్వీసును అభివృద్ధి చేయండి. "

ప్రశ్న :- సర్వీసు చేసేందుకు ఉత్సాహము కలగనందుకు కారణమేమి? ఏ విఘ్నము కారణంగా ఉత్సాహము కలగదు ?

జవాబు:- అన్నిటికంటే పెద్ద విఘ్నము వికారి(క్రిమినల్) దృష్టి. ఈ జబ్బు సర్వీసులో ఉత్సాహము రానివ్వదు. ఇది చాలా పెద్ద జబ్బు. ఒకవేళ వికారి దృష్టి శాంతంగా అవ్వలేదంటే, గృహస్థ వ్యవహారములో రెండు చక్రాలు సరిగ్గా నడవకుంటే గృహస్థము భారమైపోతుంది. అప్పుడు తేలికై సర్వీసు చేసేందుకు ఉత్సాహముండదు.

పాట :- మేల్కొనండి ప్రేయసులారా! మేల్కొనండి,................ (జాగ్ సజనియా జాగ్,.................)

ఓంశాంతి. మధురాతి మధురమైన పిల్లలు ఈ పాట విన్నారు. ఇలాంటి 2-4 మంచి పాటలు అందరి వద్ద ఉండాలి లేక టేపులో నింపుకోవాలి. ఇప్పుడు ఈ పాట మనుష్యులు తయారు చేసిందని బాబా అంటారు. డ్రామానుసారము పిల్లలకు ఉపయోగపడు విధంగా టచ్ చేయబడింది. ఇలాంటి పాటలను వినడము వలన పిల్లలలో నషా పెరుగుతుంది. ఇప్పుడు మేము నూతన రాజ్యాన్ని స్థాపన చేస్తున్నామనే నషా పిల్లలకుండాలి. రావణుని నుండి మన రాజ్యాన్ని తీసుకుంటున్నాము. ఎవరైనా యుద్ధము చేయునప్పుడు వీరి రాజ్యాన్ని ఆక్రమించాలి, వీరి గ్రామాన్ని మేము మా చేతులలోకి తీసుకోవాలనే ఆలోచన ఉంటుంది కదా. ఇప్పుడు వారందరూ హద్దు కొరకు పోరాడ్తారు. ఇప్పుడు రావణునితో పిల్లలైన మీ యుద్ధము జరుగుతోంది. దీని గురించి బ్రాహ్మణులైన మీకు తప్ప మరెవ్వరికీ తెలియదు. ఈ విశ్వము పై గుప్తంగా మనము రాజ్య స్థాపన చేయాలి లేక తండ్రి నుండి వారసత్వము తీసుకోవాలని మీకు తెలుసు. వాస్తవానికి దీనిని యుద్ధమని కూడా అనరు. డ్రామానుసారము సతోప్రధానము నుండి తమోప్రధానంగా అయి మీరు మళ్ళీ సతోప్రధానంగా అవ్వాలి. మీకు మీ జన్మల గురించి ఇంతకు ముందు తెలియదు. ఇప్పుడు తండ్రి అర్థం చేయించారు. ఇతర ధర్మాల వారికి ఈ జ్ఞానము లభించదు. తండ్రి తమ పిల్లలైన మీకు మాత్రమే తెలియజేస్తున్నారు. ధర్మములోనే శక్తి ఉందని మహిమ కూడా చేయబడ్తుంది. తమ ధర్మమేదో భారతవాసులకు తెలియదు. మనది ఆది సనాతన దేవీదేవతా ధర్మమని ఇప్పుడు తండ్రి ద్వారా తెలిసింది. తండ్రి వచ్చి మళ్ళీ మమ్ములను ఆ ధర్మములోకి బదిలీ చేస్తారు. మన ధర్మము ఎంత సుఖమునిచ్చేదో మీకు తెలుసు. మీరు ఎవరితోనూ యుద్ధము మొదలైనవి చేయరాదు. మీరు మీ స్వధర్మములో స్థితులై తండ్రిని స్మృతి చేయాలి. దీనికే సమయం పడ్తుంది. కేవలం చెప్పడముతోనే స్థితమవ్వలేరు. ఆత్మనైన నేను శాంత స్వరూపాన్ని అని లోపల స్మృతి ఉండాలి. ఆత్మలైన మనమిప్పుడు తమోప్రధానంగా, పతితంగా అయ్యాము. మనము శాంతిధామములో ఉన్నప్పుడు పవిత్రంగా ఉండేవారము తర్వాత పాత్రను అభినయం చేస్తూ చేస్తూ తమోప్రధానంగా అయ్యాము. ఇప్పుడు మళ్ళీ పవిత్రంగా అయి మనము ఇంటికి వాపసు వెళ్ళాలి. తండ్రి

నుండి ఆస్తి తీసుకునేందుకు స్వయాన్ని ఆత్మ అని నిశ్చయం చేసుకొని తండ్రిని స్మృతి చేయాలి. మేము ఈశ్వరీయ సంతానమని మీకు నషా పెరిగిపోతుంది. తండ్రిని స్మృతి చేయడం వల్లనే వికర్మలు వినాశనవమవుతాయి. ఎంత సహజము - స్మృతి ద్వారా మనము పవిత్రమై మళ్లీ శాంతిధామానికి వెళ్లిపోతాము. ప్రపంచములోని వారికి ఈ శాంతిధామము, సుఖధామాల గురించి కూడా తెలియదు. ఈ విషయాలు ఏ శాస్త్రాలలోనూ లేవు. జ్ఞానసాగరుని గీత ఒక్కటే. అందులో కేవలం పేరును మార్చేశారు. సర్వుల సద్గతిదాత, జ్ఞానసాగరుడని ఆ పరమపిత పరమాత్మునికే చెప్పబడ్తుంది. వేరెవ్వరినీ జ్ఞానవంతులని అనరు. ఎప్పుడు వారు జ్ఞానాన్ని ఇస్తారో అప్పుడు మీరు జ్ఞాన స్వరూపులుగా అవుతారు. ఇప్పుడు అందరూ భక్తి స్వరూపులు. మీరు కూడా అలాగే ఉండేవారు. ఇప్పుడు మళ్లీ జ్ఞాన స్వరూపులుగా అవుతున్నారు. నెంబరువారు పురుషార్థానుసారంగా జ్ఞానము కొందరిలో ఉంది, కొందరిలో లేదు. కనుక ఏమంటారు? ఈ లెక్కతో ఉన్నతపదవి పొందలేరు. తండ్రి సర్వీసు చేసేందుకు ఎంతో ఉమంగముతో ఉంటారు. ఇతరులకు బాగా అర్థము చేయించే శక్తి ఇంకా పిల్లలలో రాలేదు. ఇలాంటి యుక్తులు రచించాలి. పిల్లలు శ్రమపడి సమ్మేళనాలు మొదలైనవి చేస్తున్నారు. గోపులలో కొంత శక్తి ఉంది. సంఘటన ఉండాలి. దాని నుండి యుక్తులు వెలికి తీయాలి. సర్వీసు ఎలా వృద్ధి చెందుతుంది? అని వారికి ఆలోచన కలుగుతుంది. తల బాదుకుంటున్నారు. పేరు శక్తి సేన కాని విద్యావంతులు కారు. కొందరు అవిద్యావంతులు కూడా విద్యావంతులకు బాగా నేర్పిస్తారు. బాబా చెప్తారు - వికారి దృష్టి చాలా నష్టపరుస్తుంది. ఈ జబ్బు చాలా కఠినమైనది అందువల్ల ఉత్సాహంగా ఉండరు. యుగల్(జంట) అయిన మీరిరువురు రెండు చక్రాల వలె సరిగ్గా నడుస్తున్నారా? ఆ వైపు ఎంత పెద్ద పెద్ద సేనలున్నాయి! స్త్రీల గుంపు కూడా ఉంది, విద్యావంతులున్నారు. వారికి సహయోగము కూడా లభిస్తుంది. మీరు గుప్తముగా ఉన్నారు. ఈ బ్రహ్మకుమార - కుమారీలు ఏమి చేస్తున్నారో ఎవ్వరికీ తెలియదు. మీలో కూడా నంబరువారుగా ఉన్నారు. గృహస్థ వ్యవహార భారము తల పై ఉండుట వలన వంగిపోయి ఉన్నారు. బ్రహ్మకుమార కుమారీలుగా పిలువబడ్తారు. కాని ఆ వికారి దృష్టి చల్లబడదు. రెండు చక్రాలు ఒకేలా ఉండడం చాలా కష్టము. బాబా పిల్లలకు సర్వీసు చేయమని చెప్తూ ఉంటారు. కొందరు ధనవంతులుగా ఉంటారు, అయినా ఉమంగముతో ఉండరు. ధన దాహముతో ఉంటారు. కొడుకులు లేకుంటే దత్తు తీసుకుంటారు. బాబా మేమున్నాము, మేము పెద్ద ఇల్లు తీసిస్తాము అని చెప్పే ఉమంగము ఉండదు.

ఢిల్లీ రాజధాని, హెడ్ ఆఫీసు(ముఖ్య కార్యాలయము) అయిన కారణంగా బాబా దృష్టి విశేషంగా ఢిల్లీ పై ఉంది. ఢిల్లీని విశేషంగా సేవతో చుట్టుముట్టండి అని బాబా చెప్తారు. ఎవరికైనా అర్థం చేయించేందుకు లోనికి దూసుకెళ్లాలి. పాండవులకు కౌరవుల నుండి మూడు అడుగుల భూమి కూడా లభించలేదని మహిమ కూడా ఉంది కదా. ఈ కౌరవులు అనే పదము గీతలోనిది. భగవంతుడు వచ్చి రాజయోగాన్ని నేర్పించారు. దాని పేరు గీత అని పెట్టారు. కాని గీతా భగవానుని మర్చిపోయారు. ముఖ్యంగా ఈ విషయాన్నే అర్థం చేయించాలని బాబా పదే పదే చెప్తుంటారు. బనారసులోని విద్వాంసుల, పండితుల సభలోకి వెళ్లి అర్థం చేయించండి అని బాబా మొదట చెప్పేవారు. బాబా అనేక యుక్తులు తెలియజేస్తూనే ఉంటారు. కనుక బాగా ప్రయత్నించాలి. బాబా మాటిమాటికి అర్థం చేయిస్తూనే ఉంటారు. మొట్టమొదట ఢిల్లీలో సేవ చేసేందుకు యుక్తిని రచించండి. సంఘటనలో

కూడా దీని గురించి చర్చించండి. పెద్ద మేళాలు మొదలైనవి ఢిల్లీలో ఎలా చేయాలనేదే ముఖ్యమైన విషయము. వారంతా ఢిల్లీలో చాలా నిరాహార దీక్షలు మొదలైనవి చేస్తారు. మీరు అలాంటి పనులేమీ చేయరు. పోట్లాడడం, జగడాలాడడం ఏమీ లేవు. మీరు కేవలం నిదురించి ఉన్నవారిని మేల్కొల్పుతారు. ఢిల్లీ వారే బాగా శ్రమించాలి. మనము బ్రహ్మాండానికి కూడా అధికారులము, తర్వాత కల్పక్రితము వలె సృష్టికి కూడా అధికారులుగా అవుతామని మీకు తెలుసు. ఇది తప్పకుండా జరుగుతుంది. విశ్వాధికారులుగా అవ్వనే అవ్వాలి. ఇప్పుడు మీకు మూడు అడుగుల నేల అయినా సరే రాజధానిలోనే కావాలి. అక్కడ నుండి జ్ఞాన తూటాలను వదలాలి. నషా ఉండాలి కదా. పెద్దల నుండి శబ్దము వ్యాపించాలి కదా. ఈ సమయంలో భారతదేశమంతా పేద దేశంగా ఉంది. పేదల సేవ చేసేందుకే తండ్రి వస్తారు. ఢిల్లీలో చాలా మంచి సర్వీసు జరగాలి. బాబా సూచనలనిస్తూ ఉంటారు. బాబా మాకు గమనము ఇప్పిస్తున్నారని ఢిల్లీ వారు అర్థము చేసుకుంటారు. పరస్పరము పాలు, పంచదార వలె కలిసి ఉండాలి. మన పాండవుల కోటను తయారు చేయాలి. ఢిల్లీలోనే తయారు చేయాలి. ఇందుకు చాలా మంచి బుద్ధి ఉండాలి. ఎంతో చేయవచ్చు. వారు భారతదేశము మా దేశము, మేము అలా చేస్తాము..... అని ఎంతగానో పాడ్తారు. కాని అలా చేసేందుకు స్వయంలో కొద్దిగా కూడా ధైర్యము లేదు. విదేశ సహాయము లేకుండా లేవలేరు. మీకు బేహద్ తండ్రి నుండి చాలా సహయోగము లభిస్తుంది. ఇంత సహాయము ఎవ్వరూ చేయలేరు. ఇప్పుడు వేగంగా కోటను తయారు చేయాలి. పిల్లలైన మీకు బేహద్ తండ్రి విశ్వ చక్రవర్తి పదవిని ఇస్తున్నారు కనుక చాలా ఉత్సాహముండాలి. వ్యర్థ ప్రలాపాలతో అనేక మంది బుద్ధి చిక్కుకొని ఉంది. మాతల పై బంధనాల ఆపద ఉంది. పురుషులకు ఏ బంధమూ లేదు. మాతలను అబలలని అంటారు. పురుషులు బలవంతులుగా ఉంటారు. నీవే గురువు, ఈశ్వరుడు సర్వస్వమూ నీవే అని వివాహ సమయంలో పురుషులకు బలమునిస్తారు. స్త్రీ తోక వలె ఉంటుంది. వెనుక నడిచే స్త్రీ నిజంగానే తోక వలె వేలాడుతూ ఉంటుంది. పతి పై మోహము, పిల్లల పై మోహము, పురుషులలో ఇంత మోహము ఉండదు. వారు ఒక చెప్పు వెళ్ళిపోయిందంటే రెండవది, మూడవది తీసుకుంటారు, అలవాటైపోయింది. వార్తాపత్రికలలో ఇలా, ఇలా ప్రకటించండి అని బాబా అర్థం చేయిస్తూనే ఉంటారు. పిల్లలు తండ్రిని ప్రత్యక్షము చేయాలి. ఇది అర్థం చేయించడం మీ కర్తవ్యము. బాబా జతలో దాదా కూడా ఉన్నారు. కనుక ఇతను వెళ్ళలేడు. మాకు ఈ ఆపద వచ్చింది, దీని కొరకు మీరు సలహానివ్వండి అని శివబాబాకు చెప్పండి. ఇలాంటి-ఇలాంటి మాటలను అడుగుతారు. తండ్రి పతితులను పావనంగా చేసేందుకు వచ్చారు. పిల్లలైన మీకు పూర్తి జ్ఞానమంతా లభిస్తుంది. పరస్పరము కలిసి సలహాలు తీసుకోండి. పిల్లలైన మీరిప్పుడు విహంగమార్గపు సేవ చేసి తమాషా చూపించండి. బాబా కల్పక్రితము కూడా అర్థం చేయించారు, ఇప్పుడు కూడా అర్థం చేయిస్తున్నారు. అనేకమంది బుద్ధి ఎక్కడెక్కడో చిక్కుకొని ఉంది. ఉమంగమే లేదు. తక్షణము దేహాభిమానము వచ్చేస్తుంది. దేహాభిమానమే సర్వనాశనము చేసేస్తుంది. ఇప్పుడు తండ్రి సత్యమైన శ్రేష్ఠులుగా చేసేందుకు ఎంత సహజమైన యుక్తిని అర్థం చేయిస్తున్నారు! తండ్రిని స్మృతి చేస్తే శక్తి వస్తుంది. లేకుంటే శక్తి రాదు. భలే సేవాకేంద్రాలను సంభాళిస్తారు కాని నషా ఉండదు. ఎందుకంటే దేహాభిమానము ఉంటుంది. ఆత్మాభిమానులుగా అయితే నషా ఎక్కుతుంది. మనము ఎవరి (ఏ తండ్రి) పిల్లలము! తండ్రి చెప్తున్నారు - మీరు ఎంత ఆత్మాభిమానులుగా ఉంటే అంత బలము

వస్తుంది. అర్ధకల్పము దేహాభిమాన నషా ఉంది కనుక ఆత్మాభిమానులుగా అయ్యేందుకు చాలా శ్రమ అనిపిస్తుంది. బాబా జ్ఞానసాగరులు. మేము కూడా జ్ఞానము తీసుకున్నాము, అనేకమందికి అర్థం చేయిస్తున్నాము అని అనుకోరాదు. స్మృతి పదును కూడా ఉండాలి. జ్ఞానమే ఖడ్గము. స్మృతి అనేది యాత్ర. రెండూ వేరు వేరు. జ్ఞానములో స్మృతియాత్ర పదును కావాలి. అది లేకుంటే అది కొయ్య కత్తిగా అయిపోతుంది. సిక్కులు ఖడ్గాన్ని ఎంతగా గౌరవిస్తారు. అది హింసక ఖడ్గము, దానితో యుద్ధము చేశారు. వాస్తవానికి గురువులు యుద్ధము చేయరాదు. గురువంటే అహింసకులుగా ఉండాలి కదా. యుద్ధము ద్వారా సద్గతి కలగదు. మీది యోగ బలము. స్మృతి బలము లేకుండా జ్ఞాన ఖడ్గము పని చేయదు. వికారీ దృష్టి చాలా నష్టపరుస్తుంది. ఆత్మ చెవుల ద్వారా వింటుంది. తండ్రి చెప్తున్నారు - మీరు స్మృతిలో నిమగ్నమై ఉంటే సర్వీసు పెరుగుతూ ఉంటుంది. బంధువులు వినరని బాబాతో అప్పుడప్పుడు చెప్తూ ఉంటారు. స్మృతియాత్రలో పరిపక్వము అవ్వనందున జ్ఞాన ఖడ్గము పని చేయదని బాబా చెప్తారు. స్మృతి చేయు శ్రమ చేయండి. ఇది గుప్తమైన శ్రమ. మురళి నడిపించడమైతే బాగా కనిపిస్తుంది. స్మృతి గుప్త శ్రమతో కూడినది. దాని ద్వారా శక్తి లభిస్తుంది. జ్ఞానము ద్వారా శక్తి లభించదు. మీరు పతితుల నుండి పావనంగా యోగబలము ద్వారా అవుతారు. సంపాదన చేయు పురుషార్థము కూడా చేయాలి.

పిల్లల స్మృతి ఏకరసంగా ఉన్నప్పుడు, స్థితి బాగున్నప్పుడు చాలా ఖుషీ ఉంటుంది. స్మృతి సరిగ్గా లేనప్పుడు, ఏ విషయములోనైనా ఆటంకము కలిగినప్పుడు ఖుషీ అదృశ్యమైపోతుంది. విద్యార్థికి టీచరు స్మృతి ఉండదా! ఇక్కడైతే ఇంట్లో ఉంటారు. అన్ని పనులు చేస్తూ టీచరును స్మృతి చేయాలి. ఈ టీచరు ద్వారా చాలా చాలా ఉన్నతమైన పదవి లభిస్తుంది. గృహస్థ వ్యవహారములో కూడా ఉండాలి. టీచరు స్మృతి ఉన్నా తండ్రి, గురువు తప్పకుండా గుర్తుకొస్తారు. అనేక రకాలుగా అర్థం చేయిస్తూ ఉంటారు. అయినా ఇంట్లో ధన సంపత్తులు, పిల్లా పాపలు మొదలైన వాటిని చూసి మర్చిపోతారు. మీరు ఆత్మిక సర్వీసు చేయాలని ఎంతగానో అర్థం చేయిస్తారు. తండ్రి స్మృతియే శ్రేష్ఠాతి శ్రేష్ఠమైన సేవ. మనసా, వాచా, కర్మణా బుద్ధిలో తండ్రి స్మృతే ఉండాలి. నోటితో కూడా జ్ఞాన విషయాలే వినిపించండి. ఎవ్వరికీ దుఃఖమునివ్వరాదు. ఎటువంటి అకర్తవ్యము చేయరాదు. మొదటి విషయమైన పరమాత్మని తెలుసుకోలేదంటే మరే విషయమూ అర్థము కాదు. ఎంతవరకు పరమాత్మను గురించి పక్కా చేయించరో అంతవరకు ముందుకు వెళ్లరాదు. శివబాబా రాజయోగాన్ని నేర్పించి విశ్వానికి యజమానులుగా చేస్తారు. ఈ ఛీ-ఛీ ప్రపంచములో మాయ ఆడంబరాలు చాలా ఉన్నాయి. ఫ్యాషన్లు ఎంతో పెరిగిపోయాయి. ఈ ఛీ-ఛీ ప్రపంచము పై అసహ్యము కలగాలి. ఒక్క తండ్రిని స్మృతి చేస్తేనే మీ వికర్మలు వినాశనమవుతాయి, పవిత్రంగా అయిపోతారు. సమయము వ్యర్థ పరచకండి. బాగా ధారణ చేయండి. మాయా శత్రువు అనేకమంది బుద్ధిని మాయం చేసేస్తుంది. కమాండర్ తప్పు చేస్తే వారిని డిస్మిస్ కూడా చేసేస్తారు. కమాండర్‌కు సిగ్గు కలిగి రాజీనామా కూడా ఇస్తారు. ఇక్కడ కూడా అలాగే అవుతుంది. మంచి-మంచి కమాండర్‌లు కూడా అప్పుడప్పుడు నిస్తేజులైపోతారు. మంచిది

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్

ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. స్మృతి చేయు గుప్త శ్రమ చేయాలి. స్మృతిలో మగ్నమై ఆనందంగా ఉంటే సర్వీసు స్వతహాగానే పెరుగుతూ ఉంటుంది. మనసా, వాచా, కర్మణా స్మృతిలో ఉండే పురుషార్థము చేయాలి.
2. నోటితో జ్ఞాన విషయాలే వినిపించాలి. ఎవ్వరికీ దు:ఖమునివ్వరాదు. ఏ అకర్తవ్యమూ చేయరాదు. ఆత్మాభిమానులుగా ఉండే శ్రమ చేయాలి.

వరదానము :- " "విజయీ రత్నాలము " అనే నషా ద్వారా సదా హర్షితంగా ఉండే సర్వ ఆకర్షణల నుండి ముక్త్ భవ "

విజయీ రత్నాల స్మృతిచిహ్నము తండ్రి కంఠహారంగా ఈ రోజు వరకు పూజింపబడ్తూ ఉంది. కనుక సదా మేము బాబా కంఠహారములోని విజయీరత్నాలము అనే నషా ఉండాలి. మేము విశ్వ యజమాని పిల్లలము, మాకు ఏం లభించిందో, అది ఎవ్వరికీ లభించజాలదు. ఈ నషా మరియు ఖుషీ స్థిరంగా ఉంటే ఏ విధమైన ఆకర్షణకైనా అతీతంగా ఉంటారు. ఎవరైతే సదా విజయులుగా ఉంటారో వారు సదా హర్షితంగా ఉంటారు. ఒక్క తండ్రి యొక్క స్మృతిలోనే ఆకర్షితులుగా ఉంటారు.

స్లోగన్ :- " ఒక్కరి అంత్యములోనే లీనమవ్వడం అనగా ఏకాంతవాసులుగా అవ్వడం. "